క్లుప్తంగా

మిల్లులకు లైసెన్స్ తప్పనిసరి



సెస్‌కు సంబంధించిన చెక్కును అందజేస్తున్న మిల్లు నిర్వాహకుడు

నంద్యాల(అర్బన్): దాల్‌మిల్ యజమానులు మార్కెట్ కమిటీ నుంచి లైసెన్స్ తీసుకోకపోతే చర్యలు తప్పవని రీజనల్ మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్ రెహమాన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పనతో కలిసి బుధవారం పట్టణంలోని డీవీఎస్ రైస్ మిల్, మహాలక్ష్మి దాల్, రైస్ మిల్, బాలాజీ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. లైసెన్స్‌లు లేని యజమానుల నుంచి మార్కెట్ సెస్ కింద రూ.5.85 లక్షలు వసూలు చేశారు. మార్కెటింగ్ శాఖ అధికారి శేషిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

నంద్యాల(న్యూటౌన్): ఇల్లులేని నిరుపేదలతో 6వ తేదీన తహసీల్దార్‌కు స్వీయ దరఖాస్తులు అందజేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, పట్టణ కార్యదర్శి ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇల్లులేని వారికి గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నంద్యాలలో అన్ని వార్డులు తిరిగి ఇల్లు లేని వారిని గుర్తించి అర్హులకు ఇంటి స్థలాలకు ఇచ్చేందుకు సీపీఐ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం దరఖాస్తులను ఇస్తామని చెప్పారు. లక్ష్మీదేవి, సుశీలమ్మ, హరినాథ్, బాషా, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ఆ భూమిని కాపాడండి..

భూ కబ్జాకు గురైన మైనార్టీ కుటుంబానికి చెందిన గాజుల బాషా భూమిని కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. పద్మావతి నగర్‌లో ఉన్న బాషా కుటుంబానికి చెందిన 28 సెంట్ల భూమిని కబ్జా చేశారని ఆరోపించారు.

ఉపాధి కల్పనపై అవగాహన



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ డైరెక్టర్ ఎస్.గ్రిప్ గిరిజనులకు పథకాల గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతంలో 35 శాతం, పట్టణ ప్రాంతాల్లో 25 శాతం సబ్సిడీతో సేవా రంగంలో రూ.25 లక్షలు, తయారీ రంగంలో రూ.50 లక్షల వరకు రుణాలు పొందవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకుని పరిశ్రమలను ప్రారంభించుకోవచ్చన్నారు. సదస్సులో అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి, ఏపీఎం మధు, ఖాదీబోర్డు అధికారి చిన్నరాజు, ఎస్‌బిఐ, కెనరా, యూనియన్ బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన కంటైనర్



డోన్: మండల పరిధిలోని వెంగళాంపల్లి సమీపంలో ఎన్‌హెచ్-44పై బుధవారం కంటైనర్ అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. బెంగళూరు నుంచి హైదరాబాదు వైపు హిటాచీని తరలిస్తున్న కంటైనర్ వెంగళాంపల్లి చెరువు వద్దకు రాగానే డ్రైవర్ సడెన్ బ్రేకు వేశాడు. దీంతో కంటైనర్‌పై ఉన్న హిటాచీ జారి రోడ్డుకు అడ్డంగా పడింది. ఈ కుదుపులకు అదుపుతప్పిన కంటైనర్ చెరువులోకి దూసుకెళ్లింది. అయితే ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

శ్రీశైలంటెంపుల్: భక్తులకు మెరుగైన సేవలందించాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు సత్రాల నిర్వాహకులకు సూచించారు. బుధవారం ఆయన స్థానిక సత్రాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. భక్తుల సంఖ్య పెరుగుతున్న కారణంగా సత్రాల నిర్వాహకులు అదనంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. శుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ సత్రాల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ నిషేదానికి సహకరించాలన్నారు. అనంతరం ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి మాట్లాడుతూ భక్తులకు తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఆర్‌బీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఎల్లావత్తుల ఆర్ఎస్‌కేలో అరకొరగా ఉన్న యూరియా బస్తాలు, యూరియా కోసం ఆర్ఎస్‌కేలో పోటీ పడుతున్న రైతులు



ఎరువుల బస్తాలను ట్రాక్టరులో వెసుకెళ్తున్న టీడీపీ నాయకులు

వేధిస్తున్న యూరియా కొరత!

- రబీలో అధికంగా వరి పంట సాగు
- రైతుల నుంచి అధిక డిమాండ్
- ప్రభుత్వం నుంచి అరకొరగా సరఫరా
- రైతు సేవా కేంద్రాల వద్ద అన్నదాతల పడిగాపులు
- ఇక్కడా కూటమి నాయకులకే ప్రాధాన్యం!



మోటార్ సైకిళ్లపై బస్తాలను తీసుకెళ్తున్న రైతులు

రుద్రవరం: మట్టిని నమ్ముకొని వ్యవసాయం చేసే రైతులకు అవస్థలు తప్పడంలేదు. విత్తు మొదలు కోతలు, విక్రయాల వరకు అడుగడుగునా సమస్యలే. ఈ ఏడాది రబీ సీజన్‌లో మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో విస్తారంగా వరి సాగు చేశారు. ఇప్పటికే 12వేల ఎకరాల్లో పంట సాగైంది. మరో 3వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశముందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం వరి సాగుకు అవసరమైన యూరియా రసాయన ఎరువుకు డిమాండ్ అధికంగా ఉంది. బయటి మార్కెట్‌లో యూరియా బస్తా రూ.400 వరకు విక్రయిస్తున్నారు. రైతు సహాయ కేంద్రాల్లో మాత్రం రూ.270 ప్రకారం ఇస్తున్నారు.

అరకొరగా అందజేత..

రైతులకు తక్కువ ధరకు ఎరువులు, మందులు అందజేయాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. నాడు రైతులకు పుష్కలంగా మందులు, ఎరువులు అందజేశారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం ఆర్బీకేల పేరును రైత సహాయ కేంద్రాలుగా మార్చింది. ప్రస్తుతం ఎరువులు సక్రమంగా సరఫరా చేయకపోతుండటంతో రైతులకు సక్రమంగా అందడం లేదు. దీంతో బహిరంగా మార్కెట్‌లో వ్యాపారులు ధరలె పెంచి విక్రయిస్తున్నారు. యూరియ బస్తాను రూ.270 ప్రకారం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మొదటి విడతలో పలు గ్రామాల్లోని ఆర్ఎస్‌కేలకు కొంత మేర యూరియా బస్తాలను సరఫరా చేసింది. అవి రైతులకు ఏమాత్రం సరిపోవడం లేదు. అప్పట్లో యూరియా బస్తాలను కూటమి నాయకుల ఒత్తిడితో వారికి ఆర్ఎస్‌కే సిబ్బంది అధికంగా అందజేశారు. ప్రస్తుతం రెండో విడత చిన్న కంబలూరు,ఎర్రగుడిదిన్నె,ఎల్లావత్తుల,కోటకొండ గ్రామాల్లోని ఆర్ఎస్‌కేలకు తక్కువ మోతాదులో యూరియా బస్తాలు చేరాయి. విషయం తెలుసుకున్న ఆయా గ్రామాల రైతులు అధిక సంఖ్యలో ఆధార్‌కార్డులతో అక్కడికి వెళ్లి పేర్లు నమోదు చేయించుకున్నారు. అయితే రైతులు అధికంగా రావడంతో ఒక్కొకరికి రెండు బస్తాలకు మించి ఇవ్వలేమని సిబ్బంది తేల్చి చెప్పారు. అయినప్పటికీ ఎల్లావత్తులలో కొందరు కూటమి నాయకులు తమ అధికార దర్పం చూపించి పెద్ద సంఖ్యలో యూరియా బస్తాలను ట్రాక్టరులో తీసుకెళ్లారు. దీంతో ఉన్న అరకొర బస్తాలను ఒక్కో రైతుకు ఒకటి చొప్పున అందించారు. వరి అధికంగా సాగు చేశామని తమకు సరిపడ యూరియా సరఫరా చేయలేక పోవడంతో పాటు బయట మార్కెట్‌లో యూరియా ధరలను నియంత్రించలేక ప్రభుత్వం విఫలమైందని ఆయా గ్రామాల రైతులు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తమకు ఎలాంటి సహాయ, సహకారాలు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం రైతులు ఇంతగా అవస్థలు పడుతోంటే కొందరు వ్యాపారంగా మార్చుకున్నారు. వరి సాగు చేయకపోయినా, తనకు అవసరం లేకపోయినప్పటికీ యూరియా బస్తాలు కావాలని ఆర్ఎస్‌కేల వద్దకు వెళ్లి హంగామ చేసి 5,10 బస్తాలు తీసుకెళ్లి బయట అధిక ధరలకు విక్రయించుకుంటున్నారు. ఇవన్నీ తమ కళ్లెదుటే జరుగుతున్నా వ్యవసాయ అధికారులు నోరు మెదపడం లేదు. దీంతో రైతులకు సరిపడ యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారు.

సరఫరా తక్కువగా ఉంది

రైలు వ్యాగన్ల ద్వారా ప్రభుత్వం నుంచి సరఫరా తక్కువగా ఉండటంతో అందరికీ అందాలనే ఉద్దేశంతో రైతులకు ఒకటి లేదా రెండు చొప్పున అందజేస్తున్నాం. రెండో విడతలో ప్రభుత్వం నుంచి సరఫరా పూర్తిగా తగ్గిపోయింది. అయినప్పటికీ వచ్చిన వాటిని అందరికీ అందేలా చూస్తున్నాం. టీడీపీ నాయకులకు అధికంగా ఇచ్చిన విషయం నాకు తెలియదు.

– రాజు, ఏఈఓ, రుద్రవరం

అన్నదానం

చాగలమర్రి: స్థానిక పాత బస్టాండ్ సమీపంలో వెలసిన శ్రీచెన్నకేశవ స్వామి ఆలయంలో బుధవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నరసింహస్వామి, శివ మాలధారులకు 110 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బొద్దు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. సభ్యులు గుత్తి నరసింహులు, సల్లా నాగరాజు, రోహితేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ జట్టు కోచ్ మేనేజర్ల నియామకం



ఎంపికైన మేనేజర్లు

నంద్యాల(న్యూటౌన్): అండర్- 19 ఫెన్సింగ్ జాతీయ జట్టు కోచ్ మేనేజర్లను నియమిస్తూ జిల్లా విద్యాశాఖాదికారి జనార్దన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని స్కూలుగేమ్ ఫెడరేషన్ నిర్వాహక కార్యదర్శి శ్రీనాథ్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు పాట్నాలో జరిగే అండర్-19 బాలుర ఫెన్సింగ్ జాతీయ క్రీడల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు మేనేజర్‌గా నందివర్గం హైస్కూలు ఫిజికల్ డైరెక్టర్ వెంకటసురేష్, బాలికల జట్టు మేనేజరుగా నంద్యాల ప్రభుత్వ బాలికల హైస్కూలు ఫిజికల్ డైరెక్టర్ రాణెమ్మ, గడిగరేవులు హైస్కూలు ఫిజికల్ డైరెక్టర్ కవితను నియమిస్తూ ఉత్తర్వులు అందాయన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(న్యూటౌన్): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మారుతీ శంకర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వెలాసిటీ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యక్షతన సైబర్ నేరాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల భద్రత, మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్ తదితర వాటిపై అవగాహన కల్పించారు.

ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండండి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: బాధ్యతలు స్వీకరించిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలతో సానుకూల దృక్పథం కలిగి ఉండి, సత్సంబంధాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో లైఫ్ కోచ్ మోటివేషన్ స్పీకర్ డాక్టర్ ఎన్.రాంబాబు నిర్వహించిన స్ట్రెస్ మేనేజ్‌మెంట్, పాజిటివ్ థింకింగ్‌పై జిల్లా అధికారులు, ఉద్యోగులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై ప్రజలు ఎంతో నమ్మకంగా ఉంటారని, ప్రభుత్వ సేవలను మెరుగైన రీతిలో అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సహ ఉద్యోగులు, క్రింది స్థాయి సిబ్బంది ఉన్నతాధికారులతో సత్సంబంధాలు కలిగి షట్‌చక్ర బంధంతో పనులు చేస్తే విజయాలు సాధ్యమవుతాయన్నారు. గంభీరత్వానికి పోయి ప్రతికూల దృక్పథాలతో పనిచేస్తే ఆత్మసంతృప్తికి ఆటంకం ఏర్పడుతుందన్నారు. తాము నిర్వహిస్తున్న విధులపై పట్టు సాధిస్తేనే ఉన్నత స్థితికి వెళ్లగలమని పేర్కొన్నారు. అనంతరం రాంబాబు మానసిక, శారీరిక ఒత్తిడిని తగ్గించే అంశాలపై వివరించారు. డీఆర్‌ఓ రామునాయక్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ లీలావతి పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం



రుద్రవరం రైతులు, నాయకులతో మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

రుద్రవరం: మోసపోయిన రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రం రుద్రవరంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొల్లం పుల్లయ్య అన్న నరసింహులు ఇటీవలె అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన బుధవారం రుద్రవరం చేరుకొని మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన గ్రామ నాయకులు, కార్యకర్తలు,రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా కొందరు రైతులు మొక్క జొన్నల వ్యాపారి చేతిలో మోసపోయామని, దాదాపు 4నెలలు అవుతున్న సొమ్ము అందలేదని వాపోయారు. స్పందించిన మాజీ ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు సొమ్ము అందించేలా చూస్తామన్నారు. త్వరలోనే మోసపోయిన వారందరికి న్యాయం జరుగుతుందని చెప్పారు. అనంతరం ఆర్.కొత్తూరులో ఇటీవల మురళి అనే వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఆయన వెంట ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ మాజీ చైర్మన్ గంధం రాఘవ రెడ్డి,నాయకులు గంగిశెట్టి మద్దిలేటయ్య,సింహ్మాం,బ్రహ్మయ్య,టీఏ.నర సింహ్మారావు (బాబు),కొల్లం నరసింహులు,కృష్ణమూర్తి,జాకీర్ ఉన్నారు.

సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఏడీఈ రమాకాంత్‌చౌదరి

శిరివెళ్ల: పీఎం సూర్య ఘర్ యోజనపై ప్రజలకు అవగాహన కల్పించాలని ట్రాన్స్‌కో ఏడీఈ రమాకాంత్‌చౌదరి అన్నారు. బుధవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో శిరివెళ్ల, రుద్రవరం, గోస్పాడు మండలాల ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల పైన సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవటానికి కేంద్ర ప్రభుత్వం భారీగా సబ్సిడీ ఇస్తుందన్నారు. అలాగు ప్రభుత్వమే బ్యాంక్‌ల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తుందన్నారు. తమ గృహావసరాలకు పోనూ మిగిలిన విద్యుత్‌ను తమ సంస్థ కొనుగోలు చేస్తుందన్నారు. ప్రస్తుత విద్యుత్ బిల్లు కన్నా సోలార్ విద్యుత్ వినియోగంతో తక్కువ బిల్లు వస్తుందన్నారు.120 యూనిట్లు తమ విద్యుత్ వాడితే రూ. వెయ్యి బిల్లు వస్తుందని, అదే సోలార్‌తో రూ.338 వస్తుందన్నారు. ఏడాదికి వినియోగదారునికి రూ.8 వేలు ఆదావుతుందని చెప్పారు. అలాగే ఆళ్లగడ్డ డివిజన్‌లో 76 గ్రామాల్లో 24 గంటల విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు మొదలయ్యాయన్నారు. ఆయా గ్రామాల్లో ఇళ్లకు, వ్యవసాయానికి ప్రత్యేక లైన్ ఏర్పాటు జరుగుతుందన్నారు. ఇందు కోసం సబ్‌స్టేషన్లలో ప్రత్యేక ఫీడర్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత నెలలో రూ. 4.45 కోట్లకుగాను రూ. 4.40 కోట్ల బిల్లుల మొత్తం వసూళ్లయయ్యాయన్నారు. సబ్‌డివిజన్‌లో రూ. 5 కోట్ల పాత బకాయిలున్నాయని వివరించారు. ఏఈలు నాగార్జున, సునీల్ కుమార్, జ్ఞాన సూర్యుడు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

రుద్రవరం: మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన మాబువలి (57) చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ వరప్రసాదు తెలిపిన వివరాల మేరకు.. రెండు రోజుల క్రితం మాబువలి తమలపాకు తోటలోకి వెళ్లి పశుగ్రాసం కోస్తుండగా పాము కాటు వేసింది. అస్వస్థతకు గురైన ఆయనను చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరు గైన చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అన్యాయం

గోస్పాడు:కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు సురేష్, మార్క్ అన్నారు. బుధవారం తహసీల్దార్ షేక్ మొహిద్దీన్‌కు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో గ్రామీణ పేదలకు నిధుల్లో కోత, ఉద్యోగ, కార్మికులను కార్పొరేట్ కంపెనీలకు కట్టుబానిసలుగా మార్చేలా అమలు చేశారని విమర్శించారు. బడ్జెట్‌కు నిరసనగా ప్రజా సంఘాలు ఆందోళన కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చెన్నయ్య, కరీముల్లా, శ్రీనివాసరెడ్డి, వీరభద్రుడు పాల్గొన్నారు.

శనగ కోతలు షురూ!



క్రిష్టిపాడులో యంత్రం సాయంతో శనగ పంటను కోస్తున్న దృశ్యం

రబీలో సాగుచేసిన శనగ కోతలు మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయి. మెట్ట పంటల్లో భాగంగా మాతృ పంటగా భావించే శనగ పంటను సుమారు 7వేల హెక్టార్ల వరకు సాగు చేశారు. దిగుబడులు ఆశించిన మేర వస్తున్నా ధర పూర్తిగా పడిపోయింది. విత్తనం విత్తే సమయంలో ఎర్ర శనగలు క్వింటా రూ. 7వేలకు పైగా ఉండగా ప్రస్తుతం రూ.6వేల లోపు పలుకుతోంది. అలాగే తెల్ల శనగలు రూ.9వేలకు పైగా ఉండగా ప్రస్తుతం రూ. 7వేలకు తక్కువగా అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. ఎర్రశనగలు ఎకరాకు 7– 8 క్వింటాళ్లు వస్తుండగా తెల్లశనగలు మాత్రం 6– 7 క్వింటాళ్ల వరకు వస్తున్నాయి. గతేడాది తెల్లశనగలు క్వింటాకు రూ.9వేలు, ఎర్రశనగలు క్వింటాకు రూ.7వేలకు పైగా ధర లభించిందని రైతులు పేర్కొంటున్నారు. –దొర్నిపాడు

బండలాగుడు పోటీల విజేత బేతంచెర్ల ఎద్దులు

తుగ్గలి : బాబా మస్తాన్‌వలి స్వామి ఉరుసు సందర్భంగా మారెల్లలో బుధవారం బండలాగుడు పోటీలను ప్రారంభించారు. పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో చేదోడుగా ఉంటున్న పశువులను రైతులు సంరక్షించుకోవాలన్నారు. హోరాహోరీగా జరిగిన బండలాగుడు పోటీల్లో బేతంచెర్ల భానుజ వృషభాలు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో దొర్నిపాడు, దాసరిపల్లి బత్తుల మనోహర్, దేవరాజునాయుడు వృషభాలు, మారెల్ల వడ్డే పరమేష్, జొన్నగిరి అద్దంకి మస్తాన్, బోయినపల్లి నరసింహారెడ్డి, పందిర్లపల్లి ఖలీల్‌బాషా వృషభాలు నిలిచాయి. ఎద్దుల యజమానులకు వరుసగా దాతల సహకారంతో రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు అందజేశారు.

పంటల బీమా పరిహారం విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న కిసాన్ సంఘ్ నాయకులు

నంద్యాల(అర్బన్): 2023–24 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్, రబీ పంటల బీమా పరిహారం వెంటనే విడుదల చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్‌రెడ్డి కోరారు. పరిహారం విడుదలతో పాటు రైతులను ఆదుకునే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ బుధవారం జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఏడాది ఖరీఫ్, రబీ పంటల బీమా పరిహారం అందక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్నదాత సుఖీభవ మొత్తం కూడా ఇవ్వనందున చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వం నుంచి, బీమా కంపెనీల నుంచి వచ్చే ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. భూ యజమానులు, పక్క భూముల యజమానుల సమక్షంలోనే రీ సర్వే చేయాలని విజ్ఞప్తి చేశారు. కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఉయ్యాలవాడ : గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరమ్మ, ఫకూర్‌బీ, కాశింబీ, గురులక్ష్మి సూచించారు. బుధవారం స్థానిక 3వ అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వబాల్యదశ సంరక్షణ విద్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణికి సీమంతం చేశారు. బిడ్డ ఎదుగుదలకు, గర్భం దాల్చిన నాటి నుంచి 9 నెలల వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలుకువలను సూచించారు.



ఉయ్యాలవాడలో గర్భిణికి సీమంతం చేస్తున్న దృశ్యం

రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలి



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వ, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక, కర్షక సంఘాల నేతలు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం లక్ష్మణ్ అధ్యక్షతన నంద్యాల టెక్కె మార్కెట్ నుంచి సంజీవనగర్, మున్సిపల్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఎరువుల ధరలు తగ్గించాలని, వ్యవసాయ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని, స్కీం వర్కర్లకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని కోరారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు తోటమద్దులు, నాయకులు గౌస్, బాలవెంకట్, పుల్లా నరసింహ, వెంకటలింగం పాల్గొన్నారు.

కాపుల స్వయం ఉపాధికోసం రుణాలు

దొర్నిపాడు: వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ద్వారా స్వయం ఉపాధి పొందేదుకు కాపు (కాపు, బలిజ, తెలగ, ఒంటరి) వారికి రుణాలు అందజేస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాపు సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ ఆదేశాల మేరకు 2024–2025 వార్షిక ప్రణాళికలో భాగంగా దొర్నిపాడులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఒక యూనిట్‌కు రూ.3లక్షలు కేటాయించినట్లు చెప్పారు.కాపులు ఎవరైనా స్వయం ఉపాధి పొందేకు 50 శాతం రాయితో రుణం పొందేందుకు అవకాశం ఉందన్నారు. అర్హత కల్గిన వారు తగిన ధ్రువపత్రాలు సమర్పించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.